కథానిక :

నిన్న, నేడు, రేపు

★

'శార్వరి'

ఆ విషయం ఎవరికిమాత్రం ఏం తెలుసు! అది రహస్యం అనటానికికూడా ఆట్టే అవకాశాలు లేవు. రహస్యమే అయితే ఎవరో పసిగటివుండురు. అయినా రహస్యాలు దాగుతాయా. జీతం భత్యం లేకండా రహస్యాల ఆమూకీ తీసేపెద్దలు సంఘంలో అనేకమంది వుంటారాయె! అందులోనూ ముఖ్యంగా పల్లెటూళ్లో! ఏబజార్న ఏం జరిగినా బయటకురాని ముసలమ్మకుసైతం పొద్దూకేవేళకు తెలియవలసిందే... రోజులు, నెలలు, సంవత్సరాలు జరిగినా ఎవరికీ తెలీ లేదు గనక అది రహస్యంమాత్రంకాదు. కావటానికి పసేమీ ఆస్కారంలేదు. అంతమాత్రాన ఆవెనక ఏదో రహస్యంలేదని అనుకోటానికి సుతరామూ వీల్లేదు....

సీతారావమ్మ ఒకర్తే ఆయింటో బిక్కు బిక్కుమంటో కాలంగడపటానికి కారణం ఏమిటి? ఆమెకి మగదిక్కంటూ లేదా? వుంటే ఆవిడతో సంబంధం లేకుండావున్నారా? లేకుంటే ఆవిడ పోషణఏమిటి? వెనకెత్తు నలువాగుడవా వున్నదా? అని కొత్తవాళ్ళకి అనుమానాలు కలగొచ్చు ఆమె వొంటరిగా బ్రతకటం చూచి. కాని వూళ్లోవాళ్ళకు అలాంటి అనుమానాలు కలగటానికి అవకాశంలేదు. కారణం సీతారావమ్మను అంతా ఎరుగుదురు! అంటే అందరు ఆమెముఖం చూచివుండకపోవచ్చు. ముఖ్యంగా ఒక విషయం ఏమంటే పల్లెటూళ్ళలో ఎవరు ఎవరికి ఏమౌతారో తెలియకుండా ఎవరికీ వుండదు. ఫలానా వెంకమ్మ ఏనాడు బజార్న నడిచినపాపాన పోకపోయినా, మగవాళ్ళకంటపడ్డపాపాన పోకపోయినా ఆవిడగారి చరిత్రఅంతా ఆమెముఖం చూడని పెద్దమనుషులందరికీ తెలుసు. అలాగే ఫలానా నాంగేంద్రాన్నీ చూచి వుండకపోయినా ప్రతిఅమ్మకు ప్రతిపిల్లలు, కొత్త కోడళ్ళకు సైతం అతని ప్రవర్తనను గురించి తెలుసు.

సీతారావమ్మ అలాంటి కోవలోని స్త్రీ. ఏనాడూ బయటకువచ్చి ఎరగదు. వెంకటప్పయ్య బ్రతికున్న రోజుల్లోగూడా అలాగే కాలం గడుపుకొచ్చింది. గౌరవాన్ని నిలబెట్టుకోగలిగింది. మొగుడు పోయేనాటికి 'నాగు' బొత్తిగా అయిదేళ్ళవాడు. మిగిలింది అయిదెకరాల కుంట. 'నా' అనే బంధువులంటూ లేకపోవటంచేత కొడుకుని పెంచి పెద్దవాణ్ణి చేసే భారం తనపైన వేసుకుంది.

నాగు పెద్దవాడై, చదువు సంధ్యలు పూర్తి చేసుకునేనాటికి వాళ్ళకు మిగిలింది శూన్యం. ఉన్న పొలం కాస్త చదువుకి హారతి కర్పూరంలా అయిపోయింది. అదిఒక లోపంకూడా కాదు. ఎందువల్లనంటే నాగు ఒకఉద్యోగం సంపాదించుకున్నాడు. యితరులపై ఆధారపడవలసిన అగత్యం లేదతనికి. నాగు ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలయింది. ఈ నాలుగు సంవత్సరాల్లోను ఒక్కసారికూడా యింటికి రాలేదు. ఎందుకురాలేదో ఎవరికీ తెలీదు. కాని అందరూ అనుకుంటారు 'అతనికి రావల్సిన పనిమాత్రం ఏమిటి' అని. వూళ్లో పెద్దలంటారు 'ఈ కుర్రకారంతా అంతే. కాస్త ప్రయోజకులైతే సరి ఉన్న వూరు, తిన్న తిండిగూడా మర్చిపోతారు.'

అదీ నిజమేనంటారు చాలమంది. అనేకమంది చదువుకునేరోజుల్లో అనేకమంది పెద్దల్ని ఆశ్రయించి, తిండికీ డబ్బుకూ గూడా, ఉద్యోగాలు సంపాదించేసరికి వారిని మరచిపోవటంకద్దు. ఉదాహరణకు వారాలుచేసుకుని చదివే కుర్రాళ్లనే చూడండి. ప్రతివారం తప్పని అతిథిగా తయారై నాలుగైదు సంవత్సరాలు యింట్లోమనిషిగావుండి చివరకు మర్చిపోవటంకద్దు. అలా వారాలుచేసుకుంటూనే కంటికింపైన అమ్మాయిలు కనిపిస్తే ఏదో అవస్థపడటం, చివరకు చెప్పుదెబ్బలుదాకావచ్చి, చదువులకు ఉద్వాసనచెప్పి వెళ్ళిపొయ్యేవారి విషయంకాదు. కాని 'నాగు' అలాంటి ప్రమాదాలకు లోనుగాలేదు ఏనాడున్నూ. అయితే ఉన్నది కాస్త పూర్తయింది'లేదు' అని అనిపించుకోకుండా చేసుకోవటంకోసం.

నిజంచెప్పాలంటే 'నాగు'కు ఆవూళ్లో ఏమిటి పని. పొలం పుట్రావుంటే చూచేందుకైనా వచ్చి వుండేవాడు. అలాంటి అమాంబాబతు ఏమీ మిగల లేదు. ఎవరైనా పీక్కుతింటారనటానికి బాకీలుకూడా లేవు. స్నేహితులంటూ బహుశా వుండకపోవచ్చు. అతని మనస్తత్వం అర్థంగాదు. 'అసలు అతని తత్వమే అంతరా' అంటారు తలనెరసిన పెద్దలు. నాగుని చిన్నప్పటినుండి ఎరిగున్న వూరివాళ్ళు. చిన్నతనం నుండి నాగు ఎవరితో నూ పరిచయం పెట్టుకునేవాడు గాడు. బజార్న నడుస్తున్నా ఎవరితో జోక్యం కలిగించుకోడు. "ఏంరా! నాగూ ఏలా చదువుతున్నావ్" అంటే అదోలా మొఖం పెట్టి 'నీకెందుకేం అన్నట్టుచూచి' తలవంచుకు వెళ్ళిపొయ్యేవాడు చిరునవ్వుతో...ఈ మనుషులు ఎందుకు అనవసరంగా జోక్యం కలిగించుకుంటూరా అని అనుకుంటో.

పెద్దవాళ్ళతో పరిచయాలు చాలమంది కుర్రాళ్ళకు వుండకపోవటం సాజం. అసలు కుర్రకారుకి పెద్దవాళ్ళనిచూస్తే భయం. తమ చదువుల విషయం ప్రశ్నిస్తారని. ఈ ముసలివాళ్ళు వేసే ప్రశ్నలుకూడా చాల గమ్మత్తుగా వుంటాయి. బియ్యే యంఏలు చదివిన వాళ్ళుకూడా సమాధానం చెప్పలేరు. 'అరే అబ్బాయిలూ మనవూరి కాలవదాటకండా, కొలవకండా వెడల్పెంతో చెబుతార్రా' అంటారా...మాకు తెలీదు అనటం ఒక్కటే సమాధానం. అయినా కుర్రాళ్లజోలి పెద్దాళ్లకెందుకు నాకు తెలీకడుగుతాను.

'నాగు'ని చూస్తే కుర్రకారుకి ఒకవిధంగా కోపం, ఒకవిధంగా గౌరవం. తమతో కలవడనీ తమ వూసే పట్టించుకోడని, బస్తీకివెళ్ళినా చూచీ చూడనట్టే తప్పుకుపోతాడని కోపం. కాని తమవూళ్లోకల్లా తమలాపల్టీలు కొట్టకండా, శ్రద్ధగాచదివి కాస్త గౌరవమర్యాదలతో, నాగరికతా ప్రపంచంలో బ్రతుకుతున్నాడు అని గౌరవం, నిజం చెప్పాలంటే అదీకూడా కాదు. కాలం ఖర్మంకలసిరాక ఎప్పుడన్నా ఫలానా వెంకటసుబ్బయ్య మావాడేననో, రాఘవులు నాకు దగ్గర బంధువనో చెబుతాడుగదా, అంత గొప్పవాడు, చదువుకున్నవాడు ఆమాటఅంటే తమకెంత గౌరవం లభించినట్లు అని వాళ్ళవూహలు. అవి బైటకు చెప్పరు. ఎంత చదువులేనివారయినా తమ తక్కువతనాన్ని వొప్పుకుంటారా, ఎదుటివాడి గొప్పతనాన్నయినా తక్కువచేస్తారుగానీ.

వూళ్లో పిన్నాపెద్దా ఏం అనుకున్నా, అనుకోకపోయినా 'నాగు'కి మరేంబాధలేదు. అతను వాళ్ళలోకి ఎట్టాగూరాడు. వాళ్ళతోకలిసి తిరిగేదీ లేదు. ఫలానా నాగు అని చెప్పుకునే గర్వం,అదృష్టం వారికుండటం అతనికేం అభ్యంతరం! మొత్తానికి నాగు ఆవూరివాళ్ళలోకే—ప్రత్యేకం.

"ఊరందరిదీ వొకదారి వులిపికట్టెది వొకదారి అంటారు" ఊరునాడు ఏకమైతే మాత్రం సీతారావమ్మకు నాగుకి సంబంధంలేదని అనగలరా! ఎంతయిదయినా తల్లీ, కొడుకు.

సీతారావమ్మ తత్వం తెలిసినవాళ్ళు—చాలమందికి ఆమెతత్వం తెలీదు నిజానికి—ఆమె గర్విష్టి అనరు. అంటే వాళ్ళపాపాన వాళ్లేపోతారు. ఆమెకు ఏం జూచుకుని గర్వం. పెద్దఆసామీ పెళ్లాంగనకనా... పెద్ద అందమైనదిగనకనా. అదీలేదు యిదీలేదు. చాల సామాన్యమైన అందం.సంపద అంతకన్న సామాన్యం. ఎందరు వొప్పుకున్నా వొప్పుకోకపోయినా ఆమెకు ఒకవిధంగా గర్వం ఎక్కువే. 'నాగు' చదువు, ఉద్యోగంచూచిగాని మరే ఐశ్వర్యమూ చూచిగాదు. అయినామాత్రం ఆమెకొడుకు ఉద్యోగంచేస్తున్నాడు. ఆమె గర్వపడుతుంది...ఏ తల్లికైనా వుంటుంది. తన కొడుకు ఒక వ్యవహర్తయి, గౌరవంగా బ్రతుకుతున్నాడంటే ఆగౌరవం తనకే దక్కినట్టు సంతోషిస్తుంది. కాదని ఎవరన్నాఅంటే ఉద్యోగస్తుల తల్లుల్ని అడగండి తెలుస్తుంది?

నిజంగా, గర్వంకాకపోయినా, అదోవిధమైన ఆనందం ఆమెకి. తనకొడుకు ఫలానా 'నాగు' అనే స్పృహ వుండకపోవచ్చు. కాని వూళ్లో అందరుస్త్రీలు

పొందే సంతోషానికి సీతారావమ్మ సంతోషానికి తేడా అక్కడే...ఆమె ఆనందం అద్వైతం.

'నీకేవమ్మా పిన్నీ..బంగారంలాంటి కొడుకు.. నిక్షేపంలాంటి ఉద్యోగం'అని ఎవరన్నా అంటే'ఊ' కొట్టి ఊరుకునేది.

'సీతారావమ్మత్తయ్యా, నాగుబావ ఎప్పుడూ రాడేం' అని పెళ్ళికాని పిల్లలు,కావటానికి పెద్దవాళ్ళే అడుగుతూండేవాళ్ళు; వాళ్ళవాళ్ళ మనసుల్లోని కోరి కల్ని, భావాల్ని పదిలపరచుకొని. సీతారావమ్మ ఇట్టే వాళ్ళను అర్థంచేసుని మనస్సులో ఆశీర్వదించేది వారిని. ఏం సమాధానం చెబుతుంది. 'నాగు' రాక పోవటం ఎన్నివిధాల ఆలోచించినా తనకంటె తన చుట్టూ వుండేవాళ్ళకే ఎక్కువ బాధాకరంగాతోచేది. ఆ అమ్మాయిలు అడగటంలో అంతరార్థం లేకపోలేదు. కారణం వుండనేవుంది. 'నాగు'కి పెళ్ళికాలేదనే విషయం రూఢిగా అందరికీ తెలుసు. పెద్దలు అనుకునే వాళ్ళు, ఏదో అన్నట్లు అవసరాలు తీరుతుంటే పెళ్ళెందుకు వాడికి' అని. వాళ్ళదృష్టిలో అతనో తిరుగుబోతని కాదుగాని, తమకు అందరాని పండుఅని.

ఒకసారి సీతరామమ్మ మనస్సు చివుక్కుమంది. అది ఏదో, ఎవర్నిగురించో అయితే ఆమెకంత బాధ కలక్కపోను. 'నాగు'ని గురించి యితరులు ఆడిపోసు కోవటం ఆవిడ పరిభాషలో. అతడు సుఖపడిపోతు న్నాడని ఆదుర్దా. అసూయ, ద్వేషం. 'వాడింకా మనవాడు అవుతాడని నమ్మకంగూటె...వాడిపోకలు, డాబులుచూస్తే ఎవరికైనా అంతే అనిపిస్తుంది' అని. "ఇంతకీ ఆ సీతారావమ్మ చేసుకున్న పాపంలే" అని. 'వాడికై వాడికి తోచాలిగాని ఒకళ్ళు ఎంతకాలమని చెప్తారు' అని రకరికాల ఊరివాడలా చెప్పుకోటం సీతారావమ్మ చెవినిబడ్డది. 'నాగు' చేసిన తప్పేమిటో ఆమెకు అర్థంగాలేదు. తెలివితక్కువవాడు అనటానికి వీల్లేదు. అవకతవకపనులు చేయటానికి. నెలనెల తనకు డబ్బు పంపుతూనే వున్నాడు. పెళ్ళి పెటాకులు లేకండావున్నాడంటె అది నిజంగా తన అశ్రద్ధే. బుద్ధికుదిరి కావాలన్నప్పుడే చేసుకుంటాడు. వాడి పెళ్ళివిషయం నేనెందుకు కలగజేసుకోవాలి' అని అనుకునేది. కనకనే 'నాగు'కూడా అశ్రద్ధ చేయగలి గాడు. తనూ నిజంగా ఆ విషయంలో ఎప్పుడూ పట్టు బట్టలేదు. కారణం పెళ్ళయినవాళ్ళంతా ఏం బావుకు తింటున్నారు గనక. పెళ్ళి ఆపైన పిల్లలు...సంసారం ప్రాణానికి సుఖంవుండదు. చూస్తూనేవున్నాంగా... చూస్తూచూస్తూ వాడికెక్కడ ఒకగంతను అంటగట్టేది. కొన్నాళ్ళయినా లోకాన్ననుభవం చేసుకోనీ అని ఆమె అనుకున్నది.

ఇప్పుడు మరీ పూర్ణమ్మపోరు ఎక్కువైంది. పూర్ణమ్మకేంవెనక బాగావున్నది. సంసారాన్ని ఈదు కొస్తుంది. మొగుడుంటూ వున్నాడుకానీ పెత్తనం మాత్రం ఆమెదే. పైగా ఒక్కతే కూతురు కమల. ఆవిడది యిష్టారాజ్యం ఆవిడయింట్లో. అదేమని అనే వాళ్ళు లేరు. మొగుడ్ని దద్దమ్మనుచేసి కూర్చోబెట్టి, పెత్తనం చలాయిస్తుంది అని కానివాళ్ళు, చూపలేని వాళ్ళు అంటే అనొచ్చు. పూర్ణమ్మకేంనష్టం. ఈ మధ్య పూర్ణమ్మకూతురు కమలకూ నాగుకూ చక్కని ఈడుజోడు అనే రహస్యం కనుక్కున్నది. చాలా కాలం ఆవిడకు ఆవిషయం తెలియనే తెలియదు. ఎవరూ చెప్పనైనాలేదు. ఒకరోజు కమలను చూస్తూ వుంటే చప్పున సీతారావమ్మ, వాళ్ళ నాగు తలపు కొచ్చారు.తన కమలంపక్కనే నాగు నిలబడివున్నట్లు, ఒడ్డూపొడుగూ బాగున్నట్లు, ఈడూజోడూ సరిపోయి నట్టు ఊహించింది. ఒక్కసారి ఒళ్ళు జలదరించింది ఆమెకి. ఆనందం పట్టలేకపోయింది. కమలను గట్టిగా కావిలించుకుని నుదుట ముద్దెట్టుకుని 'నాబంగారం' అని కళ్ళుచెమర్చుకుంది. అంతా అయోమయం అయింది కమలకు. కొంచెంసేపు తల్లివొళ్లోంచి తెప్ప రిల్లలేకపోయింది. కమలకు ఆక్షణం ఏదో బాధకలిగి, వెంటనే పట్టలేనంత ఆనందం కలిగింది. తొరతొరగా నిలువుటద్దంముందుకు పరుగెత్తి తనకుతాను ఒక్కసారి చూచుకొని చప్పున నవ్వుతో పమిట సరిచేసుకుంది పిచ్చిపిల్ల.

ఆ అనుభూతితోటే పూర్ణమ్మ కూతుర్ని సీతా రావమ్మ యింటికి అనేకసార్లు పంపడం జరిగింది. కారణం ఆమెదృష్టిలోకి తనకూతుర్నిగూడా తీసుకు రావాలనే. తనూ ఆపనీ, ఈపనీ వొంకబెట్టుకుని వెళ్ళేది.ఒకసారి మాటమీద మాటవచ్చి పూర్ణమ్మ అడి గింది'ఏడి వొదినా,అల్లుడు ఎప్పుడూ రాడేం..అయినా వొస్తేమాత్రం మాలాంటిబీదవాళ్ళం కనపడతామటలే' అని ఎత్తెబట్టుగా.సీతారావమ్మను అవహేళన చెయ్యా లని పూర్ణమ్మ మనసుకాదు.ఎట్లాగైనా ఆ సంభాషణ పెంచాలని. తనమనసులోముక్క కాస్తా చెప్పెయ్యా లని. నిజంచెప్పాలంటే పూర్ణమ్మకంటె సీతారావమ్మ ఏవిధంగా గొప్ప. యాభయ్ ఎకరాల ఆసామి పెళ్ళాం తాను...సెంటుభూమీ లేనిది సీతారావమ్మ...

'ఏమోలే వొదినా...మావాడు అదృష్టమే బావుంటే నీవు అల్లుడూ అని పిలుచుకునే రోజులు

వస్తాయేమో ఎవరు చెప్పగలరు అన్నది. ఎంతయిదయినా యాభై ఎకరాలు. సీతారావమ్మకు ఒక నోములాగా అవుపించింది. నిజం ఆమెకి కమల కోడలు కావడం ఒకవరం, కమల అందమైంది. చూడ చక్కనిది. కలవారిబిడ్డ.

‘ఆఁ ఏదో మాటవరసకి అన్నాలే వొదినా... మా అమ్మాయిని మీరు చేసుకోబోయ్యారట్లే...మీ అబ్బాయికి ఎవత్తె దొరకవలసివుందో!’ అన్నది పూర్ణమ్మ తనకూతురుకాక ఇతరులైతే ‘ఎవత్తో’ అయినట్లు...

“ఏం ఎగతాళి చేస్తావే పూర్ణమ్మా....నీకంటె నాకు అయినవాళ్ళు ఎవరే!”

మొత్తానికి మాటలుకలవటం సంబంధాలు స్థిరపట్టం కూడా జరిగింది. ‘నాగు’ని చూచి పూర్ణమ్మ నాలుగేళ్ళయింది. చదువుకునే రోజుల్లో సెలవులకు వొచ్చేవాడు అంతే. ఈమధ్య రావటమే మానేశాడు. పోనీ ఒక్క ఉత్తరంముక్కన్నా రాసి పిలిపించకూడదూ. చూచి శానారోజులైంది అన్నదిపూర్ణమ్మ.

“ఉత్తరాలకు వొచ్చేవాడటే తల్లీ....అలా రాడు” అన్నది సీతారావమ్మ...

చివరకు నిశ్చయించుకుంది తానేవెళ్ళి ‘నాగు’ని చూచిరావాలని. వీలైతే అన్ని విషయాలుచెప్పి వెంట తీసుకుని రావాలని. చాలమంది అనుకోటమేగాని కొడుకు ఉద్యోగంగురించి ఆమెకేమీ తేలీదు అమాయకురాలు. అంతా గొప్పగా చెప్పుకుంటారు కాని. అనేకమంది చూచివచ్చినవాళ్ళు అలాగేఅంటారు. తను పోవటానికైతేపోగలదు కానీ మగతోడంటూలేకుండా ఎలా పోవటం...ఏం మర్యాద! ఈ అనుమానం పూర్ణమ్మకు తెలిసి మొగుడ్ని పురమాయించింది ఆ పనికి. మహానుభావుడు కదలక తప్పేదేముంది. ఇతరులెవరైనా అంటే కాదనగలడేమోకాని తనపెళ్ళాం అంటం తను కాదంటంకూడానా...అతనితో పోవటానికి సీతారామమ్మ వెనకాముందు చూచింది. కాబోయ్యే వియ్యంకుడాయెను! తప్పనిసరి. ఎవరో వొకరు తోడు. ఆపదిక్షణాలు కాదనుకుంటే తీరిపోయె.

మనస్సు స్తిమితంచేసుకుని బైలుదేరింది. పూర్ణమ్మ పూర్తిగా ఆశీర్వదించింది సుఖంగాపోయి శుభంగారమ్మని. కమల తల్లిచాటునుండే కలలు గన్నది. బయల్దేరవమ్మా అక్కయ్యా బండికి టైమయింది అన్నాడు పూర్ణమ్మ భర్త.

బెజవాడ స్టేషనులో బండి మారాల్సివచ్చింది బందరువెళ్ళే బండికి కొంచెం ఆలస్యవుంది. అక్కడే అనుకుంది తనకొడుకు ఎలా వుంటాడో. ఎలాముస్తాబై వుంటాడోనని. బందరు బండీలో కూర్చున్నదేగానీ ఆలోచనలు అంతులేకండా కలుగుతున్నయ్. ‘నాగు’ రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. అదేదీటికెట్ కలెక్టర్ పని. నిజంగా ‘నాగు’ కలెక్టరేననుకుంది సీతారావమ్మ. ఒక్కసారి తననుచూచి గుర్తుపట్టగలడా! ఆశ్చర్యపడుతాడు ఉత్తరం ముక్కైనా రాయకండా వచ్చినందుకు. అతనికి అంతఆశ్చర్యం కలగాలనేగా తము ముందుగా తెలియపరచకండా వుంది.

గుడివాడస్టేషన్‌లో బండీఆగింది. యింకా అర గంట టైం వుంది. బండీదిగింది ఏవన్నా పళ్లు కొందామని...కొడుక్కు తనుకొనటం ఏమిటి. పిల్లాజల్లా వున్నారు అఘోరించిపోతారు అనుకోడానికి యింకా పెళ్ళి కాకపోయె...అయినా ఎందుకైనా మంచిది అవసరంవొస్తుంది అనుకుని పళ్ళుకొనాలని బండీదిగింది. సంచీ చేతిలోనేవుంది. బండిలో వుంచితే ఎవరైనా కాజేయగలరు అయినా ఈ రైలు ప్రయాణాలను నమ్మేదెవరు? దొంగలుంటారు జాగ్రత్త అని వ్రాస్తారుటగూడ.

పండ్లదుకాణం దగ్గరకొచ్చి బేరంసాగించే సందర్భంలో ఒకదృశ్యం కంటబడ్డది. వొచ్చేపోయేజనం హడావిడిగావుంది. అందులో రాత్రిపూట....జనసమ్మర్దం అట్టే లేకపోయినా ఆచీకట్లో, లైటు వెలుతుల్లో అందంగావుంది ఆజనం చూట్టానికి. రైలు ప్రయాణాలు చేసేప్పుడుగూడా ఆడాళ్ళు అందంగా తయారవుగారెందుకో...మరీ ఆ అమ్మాయి పెళ్లికూతురులా తయారైంది. బండీదిగింది కామాల్సు హడావుడిగావెళుతూంది. సీతారావమ్మకళ్లు ఆ అమ్మాయి మీదికి పోయినయ్. వెనకాముందూ ఆ అమ్మాయికి సంబంధించినవాళ్ళు ఎవరూలేరల్లేవుంది. తోలు సంచీ చేతవూపుకుంటూ వుంది. లైటువెలుతుర్లో మెరిసిపోతోంది పచ్చటి శరీరం. వొంటిపైన చీర వున్నా వొంటికాంతి బయటకు అవుపిస్తోనేఉంది.. తల అదోరకంగా దువ్వుకుని నిజానికి తల దువ్వకుందో లేదో సీతారావమ్మకు అనుమానంగానేవుంది. దువ్వుకుంటే అంత సుబురుగా ఎట్లావస్తుంది చెప్మా. ఆనడక, వొయ్యారం, అంగాల్ని విరజిమ్ముకుంటూ ఈఅమ్మాయిముందు కమలఎంత? నిజానికి ఎన్నోవంతు అందం కమలది...ఎందుకోగాని ఆ అమ్మాయిని

యింకా యింకా చూడాలని బుద్ధివేస్తోంది. కాని వెంటబడిచూస్తే ఏమనుకుంటుంది, ఛీ! ఆ వే వూహాలు తనకిమాత్రం. దూరంగా ఆగింది జనానికి దూరంగా...అక్కడ గేటుదగ్గరగా గుంపు. నెట్టుకుంటూ తోసుకుంటూ అవతలగా తెల్లటోపీ ఆయన డబాయిస్తున్నాడు. తానేదో ఘన కార్యంచేస్తున్నట్లు. తన 'నాగు'కి అదే ఉద్యోగం అలాగే అందరిమీద పెత్తనం చలాయిస్తాడు కామాల్సు. ఎంతగొప్పవాళ్ళయినా, ఎంత డబ్బుగలవాళ్లయినా, ఎంత చదువుకున్నవాళ్లయినా ఆ గేటుదగ్గర అతను ఆగమంటే ఆగాల్సిందే. పొమ్మంటే పోవాల్సిందే! ఏందశ! ఏందశ! అయినా తన 'నాగు' అట్టా అథారిటీ చలాయిస్తాడేం. ఎంతో అమాయకుడు నోట్లో నాలుక లేనివాడు నిజానికి...దయాదాక్షిణ్యాలు కలవాడు తననాగు. అలా చెయ్యాడు. ఎన్నటికీ చెయ్యాడు.

టికెట్ కలెక్టర్ ఎవర్నో మెడమీద చెయ్యివేసిలాగి అవతలగా నించోబెట్టాడు. దిక్కుమాలిన వెధవలా వున్నాడు. ఏమిటి అలా బ్రతిమలాడుతాడు. మెడబెట్టి గెంటించుకుంది చాలక. ఆ దిక్కుమాలినవాడు ఎదురు తిరిగి ఆ టికెట్ కలెక్టరిని కొడతాడేమో ననిపించింది. కాని అలా జరగలేదు సరిగదా బ్రతిమలాడుతున్నాడు. అతనో కసురుకుంటున్నాడు. రెండుచేతులా జేబిలో టిక్కెట్టు కుక్కుకుంటున్నాడు. జనం పల్చబడ్డారు. ఎంతో శ్రమపడ్డవాడిలా అతను చెమట తుడుచుకుని మళ్లా పనికి ఉపక్రమించాడు. ఇంకా ఆ అందాలరాసిఅక్కడే నిలబడివుంది. ఎంత మక్కువ. వాళ్లతో కలిసి తనూ పోకూడదా! కానీ ఆడది. గొప్పింటివారి ఆడబడుచు అయివుంది. కలవారి కోడలై వుంటుంది. ఆ అమ్మాయి నిగారింపు, చక్కదనం, అణకువ చూడ ముచ్చటగావుంది సీతారావమ్మకు. ఇంకాఅక్కడే వుంది. వెళ్లి తనివితీరా చూద్దామా అనే ఆదుర్దా కలిగింది కాని...కాని!?

జనంఅంతా పొయ్యారు. ప్లాటుఫారంమీద జనంలేరు. ఆ అమ్మాయి అక్కడ్నుంచి కదిలింది. టికెట్ కలెక్టర్ చెయిజాపాడు. ఆమె టికెట్ యిచ్చింది. అదేమిటి పాడు! టికెట్ పుచ్చుకోటానికిబదులు ఆమె చెయ్యిపుచ్చుకున్నాడు. చెయ్యిలాక్కునిరెండడుగులు వేసింది అందాలరాణి. కాణాచి కూచి. సీతారామమ్మ గుండె చల్లబడి తేరుకుంది. పొరపాటున అలా జరిగివుంటుంది అనుకున్నది. ఆ అమ్మాయివెళ్ళిపొయ్యేది తిరిగి ఆగింది. ఏవరికోసం? అక్కడ యింకెవరున్నారు గనక...టికెట్ కలెక్టర్ ఆ అమ్మాయివెంటనే పోతున్నాడు. అదేమిటి. పాడు! అలా వెంటబడటమే. మగాళ్లు ఎవరూ లేరు! ఎవరు ఏమీ అనరు...పోలీసాళ్లతో చెబుతామనుకున్నది. కాని...

అలా ఆలోచిస్తోంది. తన కొడుకు 'నాగు'కి మిగతావాళ్లకు ఎంత తేడావుంది. వుల్లి వుల్లీ, మల్లి మల్లీ నటిటారు. తన 'నాగు' అలాంటిపని చెయ్యగలడా! చస్తే చేయడు. తాను బ్రతికుండగా చెయ్యాడు. ఈ టికెట్ కలెక్టర్ల బ్రతుకులే యింతా అని అనుమానం కలిగిందికూడా. కాని తన నాగుని సమర్థించుకుంది.

చెట్టుకింద సిమెంటుదిమ్మపైన కూర్చుని ఆలోచిస్తోంది సీతారావమ్మ...మగాళ్లు ఇంతచండాలంగా ప్రవర్తిస్తారేమా అని. తన జన్మలో తను చూళ్ళేదు ఇలాంటి దగుల్బాజీ వెధవల్ని. మరీ అలా కుక్కలా వెంటబడటంలో అర్థంవుందా. పరువు మర్యాదగల పిల్లలవెంట ఒక్కర్తె వొచ్చినంతమాత్రాన వెంటబడటమే...అయినా అలా ఒక్కర్తెనూ పంపినవాళ్లకు బుద్ధిలేదు. యిన్నేళ్ళు వొచ్చినతనే ఒకర్తెరావటానికి మనసొప్పక తోడు తెచ్చుకుంది. లోకమే మారిపోయింది...అనుకుంటూ తన 'నాగు' ఇలాంటి పాపాలకులోను గాకుండుగాక అని ఆశీర్వదిస్తూ ఆ గేటువేపే చూస్తోంది.

అతను, ఆమె వొస్తున్నారు. ఆమె చెయ్యి ఆయన చేతిలో. ఏమేమిటో నవ్వులు. విపరీతపు చేష్టలు. ఆమె బుజంమీద చెయ్యివేశాడుకూడా... ఇద్దరూ నవ్వుకుంటూ వొస్తున్నారు. సీతారావమ్మకు తలకొట్టేసినంత పనయింది. స్త్రీజాతికే అవమానం కలిగేనట్టు భావించింది. ఆవిడ ఆ అందాలభరిణను కన్నెత్తి చూడలేకపోయింది. కులాసాకబుర్లుచెప్పుకుంటూ రాసుకుంటూ వస్తున్నారు ఇవతల తను వున్నాదనే పరిజ్ఞానమైనా లేకుండా. దగ్గరగా... ఇంకా దగ్గరగా వచ్చారు. అతను ఆవెధవ టికెట్ కలెక్టర్ నీతి నియమంలేని కుంక. తలపైన టోపీ తీశాడు గర్వంగా...చేత్తోబట్టుకొని విసురుకుంటూ నడుస్తున్నాడు.

సీతారావమ్మకు కాళ్ళు వొణికాయి. వొళ్ళు ఒక్కసారి గగుర్పొడిచింది. తనకళ్లను తానే నమ్మలేకపోయింది. నిజం. అది విధివైపరీత్యం. కాకపోతే నిజంఅవునా, కాదు...బాగా ఆలోచించింది.

సరిగ్గా పోల్చింది. ఎంతకీ కాదనలేకపోతుంది. నిజం అతనే. మనుషుల్ని బోలిన మనుషులు వుంటారా...? కాదు అతనే నిక్కచ్చిగా తనకొడుకు 'నాగు' అతను.

ఏమీ తోచిందిగాదు. తను ఎవరికోసం ఆశలు పెట్టుకుని పోతోందో ఆకొడుకు...ఎవడ్ని ఇంద్రుడుగా, చంద్రుడుగా, నలకూబరుడుగా ఊహించుకుందో ఆమూర్తి. ఎవడు నిర్మలహృదయుడని, అమాయకుడని న్యాయస్థుడని భావించుకుందో ఆ నాగు...ఆ అమ్మాయితో...అందాలరాణితో వెళుతున్నాడు. అలాగే వాళ్లవెనకనే చూస్తోంది. ప్లాటుఫారం చివరవరకు పోవటం చూచింది. తర్వాత చీకటిలో కలసిపొయ్యారు. ఆ తర్వాత వూహించుకోవడం అనవసరం...ఆమెకు అసహ్యం చిరాకు కలిగింది.

'బండి కదిలే టైమయింది రా అక్కయ్యా అక్కణ్ణే కూచున్నా వేం'అన్నాడు పూర్ణమ్మ మొగుడు. వులిక్కిపడి ఈలోకంలోకి వచ్చింది ఆమె. కళ్ళవెంట నీటిబొట్లు రాలాయి. 'ఏమిటే' అన్నది.

"బెజవాడ బండి ఎప్పుడు?" అనడిగింది అతన్ని.

"మనం పొయ్యేది బందరు...బెజవాడకాదు" అన్నాడు ఆయన.

"అదికాదబ్బాయ్...మనం బెజవాడ పోవాలి, అక్కన్నుండి ఇంటికి వెళ్ళాలి. నాకేమిటోగా వుంది."

"కారణం?"

"అదంతా అనవసరం...బెజవాడ టిక్కట్టు పుచ్చుకురాపో" అనిగదమాయించింది సీతారావమ్మ.

కుక్కినపేనులా వెళ్ళిపోయాడు. అతనికేమీ అర్థంకాలేదు. సీతారావమ్మ అదోరకంగా వుంది. ఎందుకో అంత కోపం. ఆమెతత్వం ఆ స్థితిలో అర్థంచేసుకోలేక పొయ్యాడు పాపం. ఎందుకోగాని కొంత భయంకూడా కలిగింది ఆమెను చూస్తూంటే, గత్యంతరంలేక వెళ్లాడు. కొడుకును చూడాలనే ఆకాంక్షతో బయల్దేరిన సీతారావమ్మ ఇలా అకస్మాత్తుగా మారిపోవటానికి కారణం ఏమిటి చెప్మా అని ఆలోచించాడు. కాని అతని బుర్రకు కారణాలు చూపగల ఆలోచనలు ఏవీ కనపడలేదు. తిరిగి బండిలో ఇంటిచేరుకున్నారు.

దోవపొడవునా పూర్ణమ్మ భయం, ఆమె మొగుడికి లేకపోలేదు, ఇంటికిపోగానే సతాయిస్తుంది. "ఆ సీతారావమ్మకు తోచకపోతే మానె నీకైనా బుద్ధివుండక్కర్లేదుటయ్యా ఎందుకు వొచ్చినయ్ ఏళ్ళు" అని పూర్ణమ్మ అడిగితే తనేం సమాధానం చెప్పగలడు కల్లబొల్లి కబుర్లకు లొంగేఘటం కాదాయె ఆమె. 'లేదు నాగు దోవలోనే ఎదురయ్యాడు పని అయింది గదా' అని తిరిగొచ్చాం అంటానికి దమ్ములు చాల్లేదు. అబద్ధం ఆడటం అంటే సామాన్యమా అమాయకులకు. మధ్యలో ఒకటి రెండుసార్లు సీతారావమ్మను కదిపి చూచాడు. ససేమిరా సమాధానం రాలేదు సరిగదా 'నీకు తెలీదులే అన్నయ్యా నామనస్సు ఏం బాగోలేదు...ఇప్పుడు నన్ను పలకరించకు' అన్నది. ఇంకేం మాట్లాడగలడు. ఆమె మొత్తానికి బాధపడుతున్నది అనిమాత్రం గ్రహించగలిగాడు. ఆబాధ ఎందువల్లనో, దానికిగల కారణాలు, సాదృశ్యాలు ఏమిటో మాత్రం తెలీలేదు. ఏమిటి తెలుస్తాయి గనక.

సీతారావమ్మ స్థితి మరీ అధ్వాన్నంగా వుంది. చావు బతుకులమధ్య ఉన్నట్లు గావుంది. ఒక వేపునుండి మమకారం పెనవేసుకుంటూంటే రెండో వేపునుండి రోతపుట్టుకొస్తోంది. పూర్ణమ్మ సంగతి దేముడు చూచాడు. ఎవరు ఎన్నను కుంటే తనకేం కాని తన 'నాగు' యిలా అయిపోయినందుకే ఆమెవిచారం. అతను ఇంతకాలం ఇంటికేసి చూడకపోవటానికి, పెళ్లివిషయం తలపెట్టక పోవటానికి కారణం తెలిసింది. వూరిపెద్దలు అన్నారంటే అనరూ! ఇలాంటి పనులు చేస్తుంటె...

సీతారావమ్మకు 'నాగు'తనకొడుకేనని గర్వంగా చెప్పుకునేక్షణాలు ఉదయంతోనే గతించినయ్. తాను గుడివాడస్టేషనులో దిగేవరకు 'నాగు' అక్షరాలా ఆమె కొడుకే అందులో అనుమానం లేదు. అది ఆమెకూడా వొప్పుకుంటుంది. కాని అడంగుకు చేరకండా గుడివాడనుండి తిరుగముఖం పెట్టినప్పుడే అనుకుంది 'ఆవెధవ నాకొడుకు కాదు. అయితే యిలాంటి పనెందుకు చేస్తాడు. చేశాడు గనక నా కొడుకుకాదు'అని. లోకం ఆవిషయం వొప్పుకోకపోయినా ఆమెమాత్రం వాచా, మనసా విశ్వసించింది. తనకు తనకొడుక్కీ రుణంతీరిపోయిందని ఎవరితో చెబుతుంది. అప్రతిష్ఠ పైగా. గప్‌చిప్‌గా వూరుకుంది. ఒక్కటే ఆమె నిర్ణయించుకుంది.

నాగు ఎప్పటికీరాడు. తను ఎన్నటికీ నాగుని చూడదు ఇక. రాంరాం...

కాని అనుకున్నదానికి విరుద్ధంగా జరిగింది. అది జరిగిన మూడోనాడు దీపాలు పెట్టే వేళకు 'నాగు' తిరిగొచ్చాడు. మునిమాపు చీకటి వేళ వచ్చాడుకనక ఆ పేటమందికి ఆశుభవార్త తెలీలేదు. పొలాల్లో పని చేస్తున్న కొందరు ఆ వెళ్ళేది సీతారావమ్మగారి నాగాయ్‌కాదూ; అంటం విన్నాడుకాని సమాధానమివ్వకుండా, వెనుదిరిగి చూడకుండానే వొచ్చేశాడు.

గుమ్మంలో 'నాగు'ని చూచిన సీతారావమ్మ ఒక్క క్షణం కాళ్లు చేతులూ ఆడలేదు. అతనితో ఎప్పుడూ జీవితంలో మాట్లాడకూడదు అని నిశ్చయించుకుంది. ఎన్నాటికీ చూడను అనుకుంది కాని 'నాగు' తనంతటతానే వొచ్చాడు. రాక రాక నాలుగు సంవత్సరాలకు. ఇప్పుడుతను పలకరించకపోతే ఎవరిఇంటికో వెడతాడు. ఎవరైనా గౌరవంగా ఆహ్వానిస్తారు...మర్యాద చేస్తారు. ఊరివారందరికి అతనంటే గౌరవంవుంది. దూరంగా వున్నప్పుడు చాడీలు చెప్పుకున్నా ఎదరపడి 'ఏంమావయ్యా, ఏం బాబాయి' అంటే ప్రతివాడికి ఒళ్లు గగుర్పొడిచి గర్వం కలిగే మర్యాదిస్తారు.

ఆ అవకాశం ఇతరులకు కలగనిస్తే తననీ, తన కొడుకునీ ఆడిపోసుకుంటారు. ఇద్దరికీ పొత్తులేదు కామాల్సు అనుకుంటారు. లోకులచేత ఆమాట అనిపించుకోవటం ఏమిటి. ఏవైనాస్పర్థలువుంటే అవి తల్లీ కొడుకులమధ్య తాముతాముపరిష్కరించుకోవాలి గాని రచ్చకెక్కిస్తే...తమ గౌరవానికే హాని అవుతుంది కుటుంబగౌరవానికే కీడు...

ఆలోచనలన్నీ ఒక్కసారి ఆమె మెదడులో తిరిగాయి. ఏమి తోచనిస్థితిలోకి వచ్చికూడా...

"ఈబండికి వచ్చావాయేం" అనడిగింది.

"అవునమ్మా" అన్నాడు నాగు.

వెంటనే కాళ్లు కడుక్కోను నీళ్లు తెచ్చింది.

నాగు స్నానంచేసి భోజనం చేశాడు. అధికంగా సీతారావమ్మ ఒక్కవిషయంకూడా మాట్లాడలేదు. అతనూ ముభావంగానే ఉన్నాడు.

పూర్ణమ్మ ఎక్కడ పసిగట్టిందో తెల్లవారేసరికి వచ్చింది. "ఏవమ్మా సీతమ్మ వొదినా...మాకు తెలిస్తే మేమేమన్నా కొరుక్కు తింటామనుకున్నావా మీ అబ్బాయిని. వొచ్చాట్టగా. మాటమాత్రం చెప్పగూడదూ" అంటూ...ఆ కూనిరాగాలకు సీతారావమ్మ వొళ్లు మండిపోయింది.

ఉదయం లేస్తూనే అన్నాడు నాగు. "నువ్వు కూడా ప్రయాణంకావమ్మా!" అని.

"నేనెందుకురా" అన్నది సీతారావమ్మ...

"అక్కడ్నుంచి మార్చేశారు ... పెద్దాపురం స్టేషను అసిస్టెంటుగా చేరాలి. ఇదివరకున్నంత స్వేచ్ఛవుండదు. అయినా పెద్దఉద్యోగం, కాదన లేకపోయ్యాను" అన్నాడు నాగు...

"ఇదివరకటిలాంటిది కాదేమిటి" అన్నది సీతారావమ్మ.

"ఇనప్పెట్టెలో పెట్టినట్టు ఉంటుంది. పాడు ఉద్యోగం" అన్నాడు. అది సీతారావమ్మకు సంతోషంఅయింది. 'నాగు' ఇకముందు వెనకటిలాగ అవకతవక పనులు చెయ్యటానికి వీలుండదుగదా?

ఎందుకో గాని పూర్ణమ్మకు పట్టరాని సంతోషం కలిగింది.